ఉన్న బాధంతా చేత్తో తీసేసినట్టు పోయింది. అతనికి పోయిన జవసత్త్వాలు తిరిగి వచ్చిన ట్టయ్యాయి. అది మొదలు సుబ్బయ్య దానికి దాసుడై పోయాడు. వరలక్ష్మి అతని స్మృతిపథంలోనించి వెనక్కి తప్పుకోసాగింది. ఆ మందు మత్తులోకి దింపి, అతని మనసుని బాగు చేసినా, శరీరాన్ని పాడుచేసింది. కాని, సుబ్బయ్య దాన్ని వదిలి పెట్టలేదు. వరలక్ష్మిని గుర్తు చేసే వస్తువులను దాచుకున్నట్టే, వరలక్ష్మిని మరిచి పోయేటట్లు చేసే నల్లమందును కూడా ఒక చిన్న రేకు డబ్బీలో దాచుకునేవాడు సుబ్బయ్య. అయితే దాన్ని మాత్రం గుడ్డ సంచీలో ఎప్పుడూ పెట్టే వాడు కాదు. చేతిలోనే పట్టుకునే వాడు. ప్రాణం పోయినా సరే ఆ డబ్బీ మాత్రం వదిలి పెట్టేవాడు కాదు.

* * *

ఒక పావుగంట గడిచింది. సుబ్బయ్య లేచి మళ్లీ లోపలికి తొంగి చూశాడు. అలివేలు కనిపించలేదు. కాళ్లీడ్చుకుంటూ మళ్లీ గేటువరకూ వెళ్లాడు. మసక చీకటి కమ్ముకొస్తూంది. మదుటిమీద చెయ్యి ఆనించి వీధి చివరి వరకూ కళ్లు ఎక్కుదీసుకుని చూశాడు. రాఘవులు కని పించ లేదు. ఉసూరుమంటూ వచ్చి మంచంలో వాలాడు. చేతిలో ఉన్న డబ్బా మూత తీసి చూశాడు. అదెప్పుడో రెండు రోజుల క్రితమే ఖాళీ అయి పోయింది. అంతకీ తను చాలా పొదుపు గానే గడుపు కొచ్చాడు. ఈసా రెండుకో మరీ అలా అయిపోయింది. ఒక్క పట్టు వేసుకుని ఇప్పటికి రెండు రోజులు కావ స్తూంది. రెండు రోజులు! రెండు రోజులు తనెలా గడిపాడు? కొట్టు ఎక్కడో ఫర్లాంగు దూరంలో ఉంది. అక్కడికి ఇప్పుడు వెళ్లగలిగే శక్తి తనలో లేనట్టుంది. ఒకవేళ వెళ్లగలిగినా తన దగ్గర పైసలేవీ? వాడు రెండు రోజుల క్రితం తను వెళ్లి నప్పుడే చెప్పాడు — "బాబుగారూ! మీ బాకీ ఇప్పటికే మూడుంపావలా అయింది. అసలు పైకి తెలీకుండా అమ్మాల్సిన పరిస్థితి. పద్దు లెలా పెట్టుకోమన్నారు? ఇంకివ్వలేను. మీరు మరో కొట్టు చూసుకోండి" అని. 'అవును, పాపం! వాడుమాత్రం ఏం చేస్తాడు? వాడి కొట్టే అంతంత మాత్రంగా నడుస్తూంది. అందరూ బాకీలు పెట్టేస్తే ఎలాగ? అందులో తను తీరుస్తాడని వాడికి నమ్మకం లేదు. ఏదో ముసలాయన అని జాలిపడి ఇచ్చే టట్టు ఉండేవాడు. ఇక వాడిని అడగడం బాగుండదు. పోనీ, ఏదైనా ఇచ్చి వాడి బాకీ చెల్లిద్దామంటే తన దగ్గరేం లేదు.' అంతకీ నగిషీ చెక్కిన పొన్ను కర్ర పిడి ఇచ్చేద్దామనే అనుకున్నాడు. కర్ర విరిగిపోయినా, దాని పిడి నగిషీ మాత్రం చెక్కు చెదరకుండా ఉంది. దాని ఖరీదు నాలుగైదు రూపాయలకి తక్కువఉండదు. కాని, వాడు "నా కెందుకు, బాబుగారూ? మీరే ఉంచుకోండి ఇది!" అని చెప్పి తిరిగి ఇచ్చేశాడు.

ఏడు దాటి పోయింది. ఆలోచనలతో అలిసిపోయి సుబ్బయ్య కుక్కి మంచంలో వాలిపోయాడు. అతని ఒళ్లంతా చైతన్యా వస్థలోంచి జారిపోతూన్నట్టు ఉంది.

'లాభం లేదు! ఇంకేదైనా చెయ్యాలి! ఒక్క పట్టు వేసుకోకపోతే ప్రాణం పోయేటట్టు ఉంది. ఒక్క పట్టు—కనీసం ఆవగింజంత—ఎలాగైనా సంపాదించాలి. కాని, ఎలా?', ఒక అయిదు పైసలు ఎక్కడైనా దొరికితే చాలు, ఏ కుర్రాడి నైనా బతిమిలాడి తెప్పించుకోవచ్చు. లేదా తనే ఎలాగైనా వెళ్లచ్చు. కాని, పైసలు సంపాదించడం ఎలాగన్నదే సమస్య!

"మామయ్యగారూ! ఫలహారం లోపలికి వచ్చి చేస్తారా? అక్కడికి పట్టుకు రమ్మంటారా?" అలివేలు వచ్చి అడిగింది. సుబ్బయ్య రాత్రిపూట భోజనం చెయ్యడు. నిర్లిప్తంగా అలివేలుముఖంలోకి చూశాడు.



–వి. వి. రమణారావు

'పోనీ! ఆఖరి సారిగా ప్రయత్నిస్తే! కాని, అలివేలు నుంచి వచ్చే జవాబు అతనికి తెలుసు. అయినా ఉండబట్టలేక పోయాడు. "అమ్మా! నీ దగ్గరేమయినా చిల్లర ఉందా? ఒక్క పది పైసలు, లేక పోతే అయిదు పైసలైనా చాలు!"

"లేదు, మామయ్యగారూ! డబ్బు బీరువాలో పెట్టి తాళం పెట్టాను. తాళం చెవి ఆయన దగ్గర ఉండి పోయింది."

మాట్లాడకుండా వెనక్కి వాలి పోయాడు సుబ్బయ్య.

"టిఫిను సంగతి ఏం చేస్తారు?" అడిగింది అలివేలు.

"ఇప్పుడప్పుడే వద్దమ్మా!" అన్నాడు సుబ్బయ్య. అలివేలు లోపలికి వెళ్ళి పోయింది. అలివేలు చెప్పిన మాటలో అబద్ధమేమీ లేదు. రాఘవులు నిజంగానే ఉన్న డబ్బంతా బీరువాలో పెట్టి వెళ్ళాడు. అయితే అలా చెయ్యడంలో తండ్రికి డబ్బు ఇవ్వకుండా ఉందామనే దురుద్దేశం లేదు. అతని ఉద్దేశం వేరు. అతని కో ఆశయముంది. అది తొందరగా నెరవేరడానికి అంతకుమించి మరో మార్గం లేదు.

• • •

రాఘవులు ఊరవతల ఉన్న వర్క్‌షాప్‌లో మెకానిక్‌గా చేరి రెండేళ్ళు కావస్తూంది. ఆ వర్క్‌షాప్‌కీ, రాఘవులున్న ఇంటికీ దూరం రెండు మైళ్ళకి తక్కువ ఉండదు. గడిచిన రెండేళ్ళుగా రోజూ నడిచిపోతూనే ఉన్నాడు రాఘవులు. పొద్దున్న ఎనిమిది గంటలకి ఇన్ని మెతుకులు తిని, మధ్యాహ్నం తినే టిఫిను డబ్బాలో పెట్టుకుని ఆదరా బాదరాగా రెండు మైళ్ళు నడిచి వర్క్‌షాప్ చేరుకునే సరికి అతనిలో చెప్పలేని నీరసం ఆవహించేది. ఆ తరవాత నిలబడి అక్కడ సాయంత్రం వరకూ పనిచేసేసరికి అతని కాళ్ళు చచ్చుపడి పోయేవి. ప్రాణం సగం పోయినట్టుండేది. ఆ పని అయాక రెండు మైళ్ళు నడిచి ఇంటికి వెళ్ళాలని జ్ఞాపకం వచ్చేసరికి, అతనికి జీవితం మీద విరక్తి కలిగేది. 'ఛా! వెధవ బ్రతుకు బ్రతక్క పోతేనేం?' అనుకునేవాడు.

ఏడాది క్రితం అలివేలు ఒకసారి అతనితో అంది: "చూడండి! రోజూ మీరు నడిచి వెళ్ళి చాలా నీరసపడిపోతున్నారు. ఇలా అయితే మీ ఆరోగ్యం దెబ్బతిని పోతుంది. పోనీ, ఓ సైకిలు కొనుక్కునే ఏర్పాటు చేసుకోగూడదూ?"

అలా అమాయకంగా అడుగుతూన్న భార్య ముఖంలోకి చూసి రాఘవులు పక్కున నవ్వాడు. "నాకొచ్చే జీతం ఎంతో నీకు తెలుసు కదా, అలివేలూ! రెండు వందల ఏభై. అందులో చేతికొచ్చేది రెండు వందలే. దానితో మూడు ప్రాణాల్ని నిలబెట్టాలి. ఇందులో ఏం పెట్టి కొనుక్కో మన్నావ్?" అని అడిగాడు.

అలివేలు ముఖంలో దృఢ నిశ్చయం కనిపించింది.

"పరవాలేదు! మీ కొచ్చేది రెండు వందలే అయినా, నెల కో ఇరవై రూపాయలు మిగల్చలేక పోము. చూడండి! మీరేమనుకోనంటే ఒకమాట చెబుతాను. మీ నాన్నగారి నల్లమందు ఖర్చు నెలకి ఇరవై రూపాయల దాకా అవుతూంది. మీ నాయనకి పరిస్థితులు విడమరిచి చెప్పి, అందులో ఓ పది రూపాయలు తగ్గించే ఏర్పాటు చేశారంటే, నేను ఇంటి ఖర్చులో మరో పది రూపాయలు మిగలకెయ్యగలను. ఏడాది తిరిగేలోగా మీరు సైకిలు కొనుక్కో వచ్చు. ఏమంటారు?"

రాఘవులు సందేహించాడు. పైకి ఎప్పుడూ వ్యక్తం చెయ్యకపోయినా, అతనికి తండ్రంటే చాలా ప్రేమ. మనసులో చాలా అభిమానం ఉంది. అంత అభిమానం ఏర్పడడానికి సుబ్బయ్య అర్హుడు కాకపోవచ్చు. అతను ప్రతి తండ్రీ బిడ్డలకి చేసేటంత రాఘవులికి చెయ్యకపోవచ్చు. కాని, ఒక్క విషయంలో మాత్రం అతను రాఘవుల్ని ఆకట్టుకున్నాడు. అది రాఘవులి తల్లికి అతని మనసులో ఇచ్చిన స్థానం వల్లనే. వరలక్ష్మితో తాను గడిపిన జీవితం గురించి తండ్రి చేసిన సంభాషణలూ, వరలక్ష్మిని మనసులో అతను చిత్రించుకున్న వైఖరీ చూసి రాఘవులు ముగ్ధుడయాడు. తల్లిని అంత ఉదాత్తంగా మనసులో చిత్రించుకుని, ఆమెను తలుచుకునే తండ్రంటే అతనికి ఎనలేని గౌరవం ఏర్పడింది. అందుకే తల్లిని ఎంత భక్తితో మనసులో తలిచేవాడో తండ్రిని అంతే భక్తి శ్రద్ధలతో చూసుకునేవాడు. అందుకే తండ్రికి డబ్బు విషయంలో లోటు చెయ్యడానికి అతనికి మనస్సు అంగీకరించలేదు.

"నాన్నకి ఈ వయస్సులో ఖర్చుకి వెనకాడితే బాగుండదేమో, అలివేలూ?" అన్నాడు.

"మరేం పరవాలేదు! మనం ఆయన్ని తిండి మానెయ్యమనడం లేదుగా? చెడు అలవాటుని తగ్గించుకో మంటున్నాము. అది పూర్తిగా మానెయ్యమనడం లేదు. ఈ నల్లమందుతో ఆయన ఆరోగ్యం ఎలా క్షీణించిపోతూందో చూస్తున్నారు కదా? మీరు వెళ్ళి ఆయనకి నచ్చ చెప్పండి! చూడండి! చెప్పే దేదో ఇప్పుతంగా చెప్పండి. ఇకమీదట మనం ఈ నిరస వెయ్యక తప్పదు అని ఆయన అనుకోవాలి."

రాఘవులు సందేహిస్తూనే తండ్రితో ఈ విషయం కదిపాడు. ముందర రాఘవులు చెప్పిన విషయం సుబ్బయ్యకి అర్థం కాలేదు.

"మంచిదేరా! నీకు సైకిలు ఉంటే వలసిందే! అంత దూరం నడవటమంటే మాటలా!" అన్నాడు.

"అందుకే, నాన్నా! నువ్వు నా సాయం చేస్తే, ఒక్క ఏడాది కళ్ళు


పార్క్-డేవిస్
త్రివిధోపయుక్తమైన
నికో సబ్బు
చర్మ సంరక్షణకు సబ్బులన్నిటిలో సాటి లేని మేటి

1 నికో చర్మక్రిములను సంహరిస్తుంది 2 నికో చెమట వాసనను అరికట్టుతుంది 3 నికో చర్మమును శుభ్రపరచి సంరక్షిస్తుంది

చర్మమును ఆరోగ్యవంతంగా ఉంచుకొనుటకు, నికో సబ్బుతో ప్రతి రోజూ స్నానం చెయ్యండి. దాని యాంటిసెప్టిక్ గుణం గల నురుగు చర్మ క్రిములను సంహరిస్తుంది. నికో యొక్క దోషహర గుణాలు చర్మంనుండి చెమట వాసనలను పారద్రోలుతాయి. మీ చర్మ ఆరోగ్యం దినదినాభివృద్ధి చెందుతుంది. నికోలో ఉన్న శక్తివంతమైన క్రిమినాశక పదార్థం చర్మ వ్యాధులను నిరోధించి, మీ చర్మమును తేటోవంతంగా, నైర్మల్య వంతంగా నిత్యనూతనంగా ఉంచుతుంది. చెమట పొక్కులు, మొటిమల నరికట్టి నికో మీ చర్మమును రక్షిస్తుంది. నికో తో ప్రతిరోజూ ఒళ్ళు రుద్దుకుంటే, మందు రాకుండా కాపాడుతుంది.

మీ చర్మపు ఆరోగ్యమును, లావణ్యమును రక్షించుకొనుటకు, మూడు విధముల లాభదాయకమైన నికో వాడటం నేటే ప్రారంభించండి.

మీరు నికో సబ్బు వాడటం అలవాటు చేసుకోండి ఇది మీ చర్మ సంరక్షణకు చాలా అవసరం.




Regd. Trade Mark. Regd. ... Davis (India) Ltd., Bombay

మూసుకుని ఎలాగో తంటాలుపడి సైకిలు కొనుక్కో వచ్చు" అని నసిగాడు.

"దానికేం? నన్నేం చెయ్యమంటావో నువ్వే చెప్పు" అన్నాడు సుబ్బయ్య. తననేదైనా చిన్న పని చేసి, డబ్బు సంపాదించ మంటాడని అనుమానం వచ్చింది సుబ్బయ్యకి. కాని, కొడుకు అసలువిషయం చెప్పేసరికి అతని గుండె తేలిక పడింది.

"ఓస్! ఇంతేగా! నాకు పది రూపాయలు నెలకి చాలురా! నేను ఎలాగో గడిపేసుకుంటాన్లే!" అన్నాడు.

అన్నాడేగాని అదెంత కష్టమైన పనో ఆ తరవాత, తరవాత తెలి సొచ్చింది సుబ్బయ్యకి. అలివేలు రాఘవులితో చెప్పి నట్టుగానే ఖచ్చితంగా నిలవ వెయ్యడం మొదలెట్టింది. డబ్బు తన చేతిలో ఉంటే సుబ్బయ్య అడుగుతాడని భయంవేసి, బీరువాలో పెట్టి తాళం వేసి, ఆ తాళం చెవి రాఘవులు చేతికే ఇచ్చేసేది. సుబ్బయ్య ఎప్పుడు అడిగినా ఆ సంగతే చెప్పేది.

మొదట్లో ఒప్పుకున్నాడు గాని, సుబ్బయ్యకి నెలకి పది రూపాయలతో గడవటం రాను రాను అసాధ్యమై పోయింది. ఎంత కృష్ణంగా గడుపుకున్నా రోజుకి అర్ధ రూపాయి కనీసం కావలసి వచ్చేది. దానితో చివరి రోజుల్లో ఇబ్బంది అయి పోయేది. తరవాత, తరవాత తెలిసిన వాళ్ళ దగ్గర చిన్న చిన్న అప్పులు చెయ్యడం మొదలెట్టాడు. రాఘవులి మీద గౌరవం కొద్దీ కొందరు అప్పు లిచ్చే వారు. కొన్నాళ్ళకు వాళ్ళూ ఇవ్వడం మానేశారు.

* * *

ఏడున్నర గంటలయింది. చిక్కటి చీకటి దట్టంగా వ్యాపించింది. సన్నటి తుంపర మొదలయింది. సుబ్బయ్య లేచి నిలబడ్డాడు. అతని కా మంచంలో అలా పడుకోవడం యమయాతనగా ఉంది. నిలబడ్డాడే గాని, అతనికి తన కాళ్ళమీద నిలుచున్నట్లు లేదు. ఒళ్ళంతా నొప్పులతో శరీరం గాలిలో తేలిపోతూన్నట్టు ఉంది. అదే సమయంలో అలివేలు లోపలికి వచ్చింది. అతను లేచి అడుగులు వెయ్యబోతూండటం చూసి, "ఫలహారం పట్టుకురానా, మామయ్య గారూ?" అని మళ్ళీ అడిగింది.

"ఆకలిగా లేదమ్మా! పోనీ, తీసుకొచ్చి నా గదిలో పెట్టెయ్య. ఆకలేసినప్పుడు తింటాను." ఎందుకో అతని మాటల్ని విన్న అలివేలు మనస్సు చివుక్కుమంది. నూతిలోంచి వచ్చినట్లున్నాయి సుబ్బయ్య మాటలు. గడిచిన మూడు రోజుల బట్టీ సుబ్బయ్య చేతుల్లో డబ్బు ల్లేవనీ, నల్ల మందుకి ముఖం వాచి ఉన్నాడనీ ఆమెకి తెలుసు. ఈ రోజు మొదటి తారీఖు. అందుకే సుబ్బయ్య రాఘవులి కోసం మరింతగా ఎదురు చూస్తున్నాడని కూడా తెలుసు. ప్రతి ఫస్టు తారీఖున రాఘవులు ఒక రూపాయికి నల్లమందు కొనుక్కొచ్చి తండ్రి చేతులలో పెడతాడు. మిగతా తొమ్మిది రూపాయలు తండ్రిచేతి కిచ్చేస్తాడు. ఆ రోజు సుబ్బయ్య ముఖంలో వెలిగే వెలుగు అలివేలు జీవితంలో ఎన్నడూ మరిచిపోలేదు. ఈ రోజు ఎనిమిది గంటలు కావస్తూన్నా, రాఘవులు ఇంటికి రాక పోవడం ఆమెకి ఆశ్చర్యంగానే ఉంది. రోజూ ఆరింటికే వచ్చేసేవాడు. ఏదో ఆలోచిస్తూ అలివేలు లోపల కూర్చుని ప్లేటులో ఫలహారం సర్ది సాగింది. సుబ్బయ్యకి మరోసారి రాఘవులు వస్తున్నాడేమో చూద్దామని ఉంది. కాని, అలివేలు


# దీనిని అలక్ష్యం చెయ్యకండి!




జలుబు తీవ్రపరిస్థితిని తీసుకురావచ్చును—రబెక్స్ రాయండి; ఒకేసారి గట్టిగా రాస్తే—జలుబుల నుండి రక్షణ నిచ్చి శక్తివంతముగా పనిచేయును.

• శీఘ్రంగా పనిచేస్తుంది-చర్మ గ్రంధులలోకి పోతుంది-శరీర వేడిమిని అధికంచేయును. * జలుబులను ఎదుర్కొను 7 వైజ్ఞానిక ఓషధులతో తయారైన -రబెక్స్ శీఘ్రంగా పనిచేస్తుంది. దీని వలన అన్ని విధాల జలుబులకు ఉపశమనము కలుగును. రబెక్స్ ఛాతీలోని బిగుత్వమును సడలించి ముక్కు దిబ్బడను, తలనొప్పిని పోగొట్టును.


8 గ్రాముల డబ్బాలో, 20 గ్రాముల మరియు 85 గ్రాముల సీసాలో దొరకును.




# రబెక్స్

everest/371a/ACW Tel

ఫలహారం తెస్తుంది కదా అని మంచం లోనే కూర్చుండిపోయాడు. మరి అయిదు నిమిషాలలో అలివేలు ప్లేటూ, మంచి నీళ్లూ తెచ్చి సుబ్బయ్య పక్కన స్టూల్ మీద పెట్టి లోపలికి వెళ్లిపోయింది. సుబ్బయ్య మళ్లీ లేచాడు. వర్షం తుంపర నించి జల్లుకు మారింది. మెల్లిగా గుమ్మంవరకూ వెళ్లి, గేటు వంక చూశాడు. రాఘవులు కనిపించలేదు. 'పోనీ, ఆఖరి సారి గేటుదాకా వెళ్లి చూసొస్తే?' మెల్లిగా తల మీదికి తువ్వాలు లాక్కుని గేటు వేపు కదిలిపోయాడు. అతని కాళ్లు సరిగ్గా నిలవడం లేదు. వణుకుతున్నాయి. సూదుల్లా వాన చినుకులు ఒంటి మీద గుచ్చుకుంటున్నాయి. అతి కష్టం మీద గేటు మీద నించి వంగి, వీధి చివరి వరకూ తొంగి చూశాడు. చీకట్లో ఏం కనిపించలేదు. అతని నరాలు స్వాధీనం తప్పాయి. గేటు పట్టుకుని అలాగే కూర్చుండ పడిపోయాడు. పరధ్యానంగా, వర్షపు ధారలను చూస్తూన్న అలివేలుకి తళుక్కున మెరిసిన మెరుపులో సుబ్బయ్య కనిపించాడు. ఒక్క ఉదుటున అక్కడికి చేరుకుని సుబ్బయ్యను జబ్బ పట్టుకుని లేవనెత్తి లోపలికి తీసుకువచ్చింది. మంచంలో పడుకోబెట్టింది. తల తుడిచింది.




"ఇంత వర్షంలో ఎందు కెళ్లారు? మీ అబ్బాయి వచ్చేస్తారు లెండి. ఇంకెంత? మహా అయితే, ఒక్క పావు గంట! ఇక్కడే పడుకోండి" అంది.

సుబ్బయ్య ఏదో గొణుక్కుంటూ పక్కకి తిరిగి పడుకున్నాడు. అతని స్వరం మాత్రం బయటికి రాలేదు. అలివేలు పెద్ద లైటు తీసి, చిన్నలైటు వేసి వెళ్లిపోయింది.

వర్షం కుండపోతగా కురుస్తూంది. మరో ఇరవై నిమిషాల్లో రాఘవులు తలుపు తట్టాడు. అలివేలు తలుపు తీసింది. ఒళ్లంతా తడిసి నీళ్లు కారుతున్నాడు రాఘవులు.

"అరెరె! తడిసి ముద్దయిపోయారు! గొడుగు తీసుకుని వెళ్లవలసింది. రండి లోపలికి! ముందు తల తుడుచుకోండి!" అంది అలివేలు గాభరాగా.

అలివేలు ఇచ్చిన తువ్వాలుతో తల తుడుచుకుంటూ, "నాన్న ఫలహారం చేశాడా?" అని అడిగాడు రాఘవులు.

"ఇంకా లేదనుకుంటా! ఆయన గదిలో పెట్టేశాను. ఈ రోజు సాయంత్రం నుంచీ ఆయన మీకోసం పడిన బాధ అంతా ఇంతా కాదు. ఒక ఏభై సార్లయినా గేటుదాకా వెళ్లి మీరు వస్తున్నారో లేదో చూసి ఉంటారు. అయినా ఎందు కింత ఆలస్యం చేశారు?" అని అడిగింది అలివేలు.

అప్పుడు గుర్తు కొచ్చింది రాఘవులికి. "అరె! ఈ రోజు నాన్నకి నల్లమందు తీసుకురావడం మరిచిపోయేనే! ఇప్పు డెలాగా? పోనీ, వెళ్లి తీసుకొచ్చెయ్యనా?"

అలివేలు రాఘవులి ముఖంలోకి చురుగ్గా చూసింది.

"ఇప్పుడు వెళతారా? ఇంత వర్షంలో? ఎలాగో ఒక లాగ ఈ రాత్రి గడిచిపోతుంది లెండి! అయినా ఆయన నిద్రపోతూ న్నట్టు ఉన్నారు. ఇప్పుడు మీరు తీసు కొచ్చినా ఆయన్ని లేపి ఇవ్వడం కుదరదు. మీరు పొద్దున్నే తెచ్చి ఇచ్చి వెళ్లిపోవచ్చులెండి! ముందు భోజనానికి లేవండి!" అతని సమాధానంకోసం ఎదురు చూడకుండా లోపలికి వెళ్లిపోయింది. రాఘవులు మెల్లిగా తండ్రి గదిలోకి వెళ్లి చూశాడు. గుడ్డి దీపపు కాంతిలో సుబ్బయ్య ప్రశాంతంగా నిద్ర పోతున్నాడు. పక్కన స్టూల్ మీద ఉన్న టిఫిన్ ప్లేటు మూత తీసి చూశాడు. అది ఎలా పెట్టింది అలాగే ఉంది. 'పోనీ, లేచాక తింటాడులే' అనుకుని బయటికి వచ్చేశాడు. అప్పుడప్పుడు సుబ్బయ్యకి ఫలహారం అలా వదిలెయ్యడం వాళ్లకి అలవాటే. రాత్రి ఎప్పుడో సుబ్బయ్య లేచి ఫలహారం ముగించి నీళ్లు తాగి పడుకునే వాడు.

భోజనం ముగించి రాఘవులు బయటికి వచ్చాడు. వర్షం కుండపోతగా కురుస్తూనే ఉంది. పూల మొక్కలన్నీ ఆ వర్షంలో తడిసి గజగజలాడుతున్నాయి. రాఘవులు చల్లగాలి రాకుండా కిటికీ రెక్కలు దగ్గరకు లాగి పక్క మీదకు చేరాడు. లైటార్పి పక్కనే పడుకోబోతూన్న అలివేలు నడుం చుట్టూ చెయ్యి వేసి దగ్గరకు లాక్కుని, "నీకో మంచి వార్త చెప్పనా?" అన్నాడు. "మంచి వార్త సరే! ముందు ఈ రోజు ఇంత ఆలస్యంగా ఎందు కొచ్చారో చెప్పండి!" అంది అలివేలు.

"అదే! అదే నేను చెప్పబోయేది, విను! ఈ రోజు సైకిలు షాపుకి వెళ్లాను" అన్నాడు రాఘవులు.

"నిజంగా! అయితే కనుక్కొచ్చారా? ఎంతట?" అంది అలివేలు.

"తొందరపడకు మరి! చెపుతాగా! నిదానంగా విను. సైకిలు అసలు ఖరీదు రెండు వందల పది రూపాయలు. కాని, దానికి సీటు, స్టాండు, కారియరు, బెల్లు— ఇవేవీ ఉండవు. అవన్నీ వేయించుకోవా లంటే మరో ఇరవై రూపాయలు అవుతుంది. మొత్తం రెండు వందల ముప్ఫయి రూపాయలు అవుతుంది."

"ఇంతకీ ఈ రోజు జీతం అందిందా?" అడిగింది అలివేలు.

"అందడం ఏమిటి? డబ్బాలో ఈ నెల వాటా అప్పుడే పెట్టేశాను. చూడు కావాలంటే!"

రాఘవులి కళ్లు ఆనందంతో మెరుస్తున్నాయి. అలివేలు లైటు వేసి, బీరువా దగ్గరకు వెళ్లి, చిన్న పెట్టె తీసుకుని వచ్చింది. అందులో ఉన్న నోట్లన్నీ బయటికి లాగింది. ఇద్దరూ కలిసి లెక్క పెట్టారు. రెండు వందల నలభై రూపాయ లున్నాయి. అలివేలు ముఖం విజయ గర్వంతో మెరిసింది.

"చూశారా! కూడబెట్టలేమన్నారు! ఏడాది తిరిగేసరికల్లా సైకిలుకి డబ్బు కూడబెట్టేశాము. ఇప్పు డేమంటారు? రేపే వెళ్లి సైకిలు కొనుక్కొచ్చెయ్యండి. ఉండండి! మంచి రోజో కాదో చూసొస్తాను." లేచి వెళ్లి కేలండరు తీసుకుని వచ్చింది అలివేలు. "ఫరవాలేదు. తిథి, నక్షత్రం మంచివే. రేపే కొనుక్కోవచ్చు. అయితే, మీకు కావలసింది రెండువందల ముప్ఫయి రూపాయలే గదా? మిగతా పది రూపాయలు ఏం చేస్తారు?" అడిగింది.

"అవును. పది రూపాయలు మిగులుతాయి కదా! పోనీ, నీవేమైనా కొనుక్కో. ఇన్నాళ్లూ నీవు ఏమీ కొనుక్కోలేదు" అన్నాడు రాఘవులు.

"అలా కాదు! పాపం, మామయ్య గారిని ఏడాది పాటు ఇబ్బంది పెట్టాము. ఇక మీదట మామూలుగా నెలకి ఆయనకి ఇరవై రూపాయలు ఇచ్చేద్దాము. రేపే ఆయనకి ఇరవై ఇచ్చెయ్యండి. ఇకమీదట నేను కూటబెట్టే పది రూపాయలతో నే నేమైనా కొనుక్కొంటాను లెండి!" అంది అలివేలు.

"అలివేలూ! నువ్వెంత మంచిదానివని!" రాఘవులు ఆప్యాయంగా ఆమెను దగ్గరకు లాక్కున్నాడు.

* * *

తెల్లవారింది. లేచి, చేతిలో శ్రీరామ చుట్టుకుని, అలివేలు కిటికీ తలుపు తెరిచింది. వర్షం వెలిసిపోయింది. పూల మొక్కలన్నీ తడిసి ముద్దయి, చలనం లేకుండా నిలుచుని ఉన్నాయి. రోడ్డు మీద జనం రద్దీ పెరుగుతూంది. అలివేలు రాఘవుల్ని తట్టి లేపింది.

### మంచి డాక్టరు

**చక్కని వ్యాయామం. ఉద్రేకాలను అదుపుచేసుకోవడం మంచి గాలి, అవసరమైన విశ్రాంతి— వీటిని మించిన మంచి డాక్టరు ఉండడు.**

**—పోప్**

"అప్పుడే తెల్లవారిందా?" కళ్ళు నులుముకుంటూ రాఘవులు లేచి కూర్చున్నాడు.

"ఆ! తెల్లవారి చాలాసేపయింది. తొందరగా ముఖం కడుక్కుని తెమలండి, ఈ రోజు సైకిలు షాపుకి వెళతానన్నారు పొద్దున్నే!"

"అవును కదూ! ఆ సంగతే మరిచి పోయేను." లేచి నిలుచున్నాడు రాఘవులు.

"నాన్న ఇంకా లేచినట్టు లేదే?" ప్రశ్నార్థకంగా అలివేలు ముఖంలోకి చూశాడు.

"అది మామూలేగా ఆయనకి రాత్రి నిద్ర పట్టకపోతే పొద్దున్న ఆలస్యంగా లేవడం?" అంది అలివేలు. "లేపమంటారా?" అడిగింది.

"వద్దులే, పడుకోనియ్యి, ఇప్పుడే లేపావంటే కొట్టుకి పరుగెట్టి నల్ల మందు తెచ్చివ్వాలి. నేను బట్టలేసుకుని తయారయ్యాక అప్పుడు లేపావంటే, తెచ్చి ఇచ్చి నేను వెళ్లిపోవచ్చు" అని బయటికి నడిచాడు.

రాఘవులు పళ్ళు తోముకుని, కాఫీ తాగి, స్నానం చేసి, బట్టలు వేసుకునే టప్పటికి ఒక గంట గడిచింది.

"సైకిలు డబ్బు జేబులో పెట్టుకుంటారా?" అలివేలు అడిగింది.

"ఇప్పుడు వద్దు. ముందర కొట్టుకి వెళ్లి, నాన్నకి నల్ల మందు తెచ్చిచ్చి, వెళ్లేటప్పుడు పట్టుకెళతాలే. ఇంక నాన్నని లేపు! రెండు నిమిషాల్లో వచ్చేస్తాను" అని గేటు వైపు నడిచాడు. అలివేలు సుబ్బయ్య గదిలోకి నడిచింది. గేటు వరకూ వెళ్ళిన రాఘవులు 'ఏమండీ' అని గాభరాగా అలివేలు పిలిచిన పిలుపుకి వెనక్కి తిరిగాడు. అలివేలు బయటికి వచ్చి, "ఇలా రండి! మీ నాన్నగారేమిటో అదోలా ఉన్నారు" అంది. ఆమె ముఖం వివర్ణమై ఉంది. రాఘవులు ఒక్క అంగలో తండ్రి గదిలోనికి చేరాడు. సుబ్బయ్య రాత్రి ఎలా పడుకున్నాడో అలాగే పడుకుని ఉన్నాడు. రాఘవులు తండ్రి చెయ్యి పట్టుకుని చూశాడు. అతని గుండెలు దడదడ కొట్టుకున్నాయి. చల్లగా తగిలింది శరీరం. చలనం లేదు. కుప్ప కూలిపోయాడు. రాఘవులు. అలివేలు నోట్లో చెంగు కుక్కుకుంది.

* * *

'నేనెందుకింత స్వార్థపరుణ్ణి అయి పోయాను? నా స్వార్థం కోసం నాన్న అవసరాలని బలి పెట్టాను. ఆ స్వార్థం కోసమే వృద్ధాప్యంలో ఆయనకి ఆనందాన్నిచ్చే అలవాటుని తగ్గించడానికి ప్రయత్నించాను. వెధవ సైకిలు కొనుక్కోక పోతే ఏం పోయింది? నాన్నని హింస పెట్టాను. చివరికి ఆయన ప్రాణాన్ని తీసుకున్నాను.' రాఘవులు చేతుల్లో ముఖం దాచుకుని వలవల ఏడవసాగాడు. 'నాకు తెలును. నిన్న నేను తొందరగా వచ్చి ఉంటే నాన్న బ్రతికేవాడు. ఎప్పుడూ ఫస్ట్ తారీఖున నాన్న కొండంత ఆశతో ఎదురుచూస్తూ ఉంటారని తెలిసీ, ఆ సైకిలు షాపుకి వెళ్లాను. పాపం, నాకోసం ఎదురుచూసి, చూసి నాన్న ప్రాణం పోయింది. నా స్వార్థంకోసం నాన్నని చంపేశాను' అని అతని కళ్ళు ధారాపాతంగా వర్షించడం మొదలెట్టాయి.

అప్పటికే జనం పోగయ్యారు. అందరూ సానుభూతి చూపించడం మొదలుపెట్టారు. రాఘవులుతో పని చేసే జగన్నాథం ముందుకి వచ్చాడు. పోగయిన జనం సానుభూతి చూపించడానికి తప్ప మరెందుకూ పనికిరారని అతనికి తెలుసు. రాఘవుల్ని తట్టి ధైర్యం చెప్పాడు. "చూడు, నువ్విలా బెంబేలు పడితే లాభం లేదు. నీ భార్య కూడా చిన్నదే. ఆమెకి కూడా ఇలాంటి విషయాలు తెలిసి ఉండవు. ఎలాగో ధైర్యం తెచ్చుకుని జరగవలసినవి చూడు!" రాఘవులు జగన్నాథం ముఖంలోకి వెర్రిగా చూశాడు.

"జగన్నాథం! ఈ పరిస్థితుల్లో నేనేం చెయ్యాలో నాకు తెలుస్తుందంటావా? అన్నీ నువ్వే చెయ్యి!" అన్నాడు. జగన్నాథం సందేహిస్తూ నిలబడ్డాడు. రాఘవులికి అర్థం అయింది. అవును మరి! అందరివీ చేతికీ, నోటికీ సరిపోయే బ్రతుకులే. "ఇప్పుడే వస్తానుండు" అని చెప్పి లోపలికి వెళ్ళాడు రాఘవులు. బీరువా తెరిచి డబ్బు దాచిన చిన్న పెట్టె బయటికి తీశాడు. అది చూడగానే అతనికి మళ్లా దుఃఖం పొంగి వచ్చింది. ఎలాగో దుఃఖం దిగమింగి పెట్టె జగన్నాథం చేతిలో పెట్టాడు. "ఈ డబ్బు పెట్టె జరగవలసిన తతంగం చూడు!" అని తండ్రి మంచం పక్కన కూలబడ్డాడు.

మరి రెండు గంటలకి సుబ్బయ్య దేహం కదిలింది. నలుగురు మనుష్యులు పాడె భుజాల మీదకు ఎత్తుకుని నడక సాగిస్తూంటే నిశ్చేష్టుడై చూడసాగాడు రాఘవులు. ఇంద్రజాలంలో ఉన్నట్టుంది అతని మనసు. గుండెల్లోంచి ఏదో మంటలా బయలుదేరసాగింది. తనే తండ్రిని కట్టేసి, ఎక్కడికో పంపేస్తూన్నట్టు అనుభూతి చెందసాగాడు. అలా నిశ్చేష్టుడై చూస్తూన్న రాఘవులి భుజం తట్టి జగన్నాథం "పద" అన్నాడు. రాఘవులు కదిలాడు.

శ్మశానం చేరిన తరవాత పాడెని కిందకు దించారు. తాళ్లు ఊడదీసి సుబ్బయ్య శరీరాన్ని అంతకుముందే పేర్చిన చితి మీదికి ఎక్కిద్దామని లేవదీశారు. ఆ లేవదియ్యడంలో సుబ్బయ్య చెయ్యి పక్కకి వాలింది. బిగుసుకున్న చేతిలో గుండ్రంగా ఉన్న ఖాళీ స్థలంలో నించి రేకు డబ్బా కిందకు దొర్లింది. జగన్నాథం అది తీసి రాఘవులి చేతి కిచ్చాడు. రాఘవులు కింది పెదవిని అదిమి పట్టాడు. కళ్ళు మూసుకున్నాడు. కళ్ల వెంట నీళ్లు బొటబొటా కారాయి. చితికి నిప్పంటించి, నిల్చోలేక దూరంగా పోయి చెట్టు కింద కూర్చున్నాడు. భగభగమని మండే మంటలని తదేకంగా చూస్తూన్న అతనికి ఎందుకో తండ్రి తన మీద కసి తీర్చుకున్నట్లు అనిపించ సాగింది.

ఆ రాత్రి రాఘవులి కో కల వచ్చింది. ఒక పెద్ద చెరువులో మధ్యను కొత్త సైకి లొకటి తేలుతూందిట. సుళ్ళు తిరుగుతూన్న నీటిని లెక్క చెయ్యకుండా తను అందులో దూకి, ఆ సైకిలుని ఒడ్డుకు తీసుకొని వచ్చాట్ట. తను బట్టలు ఆరవేసుకొనేలోగా, ఆ సైకిలు తొక్కుకుని ఎవరో వెళ్ళిపోతున్నారట. పక్కన చూస్తే తండ్రి మంచంలో లేడట. ఆయన వదిలేసిన రేకుడబ్బా మాత్రం ఉంది. అది పుచ్చుకుని తను కేకలేస్తూ తండ్రి వెనక పరుగు తీశాడట.

అర్ధరాత్రి లేచి ముఖం మీద రెండు చేతులూ కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తూన్న రాఘవుల్ని చూసి, "ఊరుకోండి! ఎందు కలా ఏడుస్తారు? ఆయుః కాలం తీరి ఆయన వెళ్ళిపోయారు. ముసలితనం వచ్చాక ఎవరయినా, ఎప్పుడైనా పోవలసిందే! లెండి! ధైర్యం తెచ్చుకోండి!" అంది అలివేలు. అని తన రెండు చేతులతో అతని ముఖం మీద ఉన్న రెండు చేతుల్నీ కిందకు లాగింది. ఆ చేతుల్లో రేకుడబ్బా ఉంది. దానినిండా నల్లమందు ఉంది. ★




వొంపు సొంపులు

—కె. వి. రాఘవస్వామి (అర్ధవరం